క్లుప్తంగా

రేపు మండల సమావేశం

పీసీపల్లి: ఈనెల 5వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని, అదే విధంగా గత సమావేశంలో చేసిన తీర్మానాలకు సంబంధించి పూర్తి వివరాలతో అధికారులు రావాలని ఆయన కోరారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.32 లక్షలు



చైర్మన్‌కు విరాళం చెక్కు అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామివారి ఆలయానికి ఆదివారం రూ.1.32 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో ఎస్‌జీఆర్. నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామివారి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.47 వేలు, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.22 వేలు, మహాప్రాకార నిర్మాణానికి రూ.30 వేలు ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.23 వేలు ఇతర విరాళాల కింద రూ. 9 వేలు వచ్చినట్లు వారు తెలిపారు. కాగా మహాప్రాకార నిర్మాణానికి జైపూర్‌కు చెందిన అట్లా భీమరాజు, ఉషారాణి దంపతులు రూ.30 వేలు విరాళం ఇచ్చినట్లు చైర్మన్, ఈవో తెలిపారు.

ఉన్నత చదువుతో సమాజాభివృద్ధి



సింగరాయకొండ: ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరుడుగా ఎదిగి ఉన్నత చదువులు చదివి సమాజాభివృద్ధికి కృషి చేయాలని హెచ్‌ఎం నిడమానూరి సురేంద్ర విజ్ఞప్తి చేశారు. మండలంలోని కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం వసంత పంచమి పర్వదినం సందర్భంగా అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని సరస్వతిదేవి విగ్రహానికి విద్యార్థులు పూలమాల వేసి ఉపాధ్యాయుల ఆశీర్వాదాలు అందుకున్నారు. తరువాత ఒకటో తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఉపాధ్యాయులు వెంకటస్వామి, కే పద్మ, విజయకుమారి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు పెంచాలి

సీఎస్‌పురం (పామూరు): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల హాజరు శాతాన్ని పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.దేవకృపావరం అన్నారు. మండలంలోని బీ బైలు అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ అంతన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థుల బరువులను రికార్డుల్లో చేసిన నమోదు సరిచూశారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా సమయపాలన పాటించి ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్ర నిర్వహణలో విధిగా సమయపాలన పాటించాలని టీచర్‌కు సూచించారు. పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వడంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

విద్యాసంస్కరణలపై చర్చ

కొండపి: ప్రభుత్వం విద్యలో నూతనంగా ప్రవేశపెడుతున్న సంస్కరణలపై అభ్యంతరాలను స్వీకరించారు. మండలంలోని స్థానిక ఎమ్మార్సీలో పాఠశాలల పునఃనిర్మాణాలపై కమిటీ సమావేశం సోమవారం విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీలో ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవోలు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు ఉన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం ఉత్తమ ఎంపీడీవోగా ఎన్నికైన కొండపి ఎంపీడీవో రామాంజనేయులు సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళి ఎంపీడీవో రామాంజనేయులు ఎంఈఓలు సురేఖ, రామారావు, సూపర్వైజర్ విక్టోరియా రాణి పాల్గొన్నారు.

అధికారులపై ధ్వజమెత్తిన ప్రజాప్రతినిధులు

- జల్‌జీవన్ మిషన్ పనులు చేయకుండానే పైపులు అమ్ముకున్నారు
- రసాభాసగా మండల సమావేశం



వ్యవసాయ అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు

హనుమంతునిపాడు: అధికారులు తమ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు.. ప్రొటోకాల్ విషయంలో పూర్తిగా విస్మరించారని ప్రజాప్రతినిధులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు ఉడుముల వెంకట సుబ్బారెడ్డి జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి పైపు లైన్లకు వచ్చిన పైపులు ఎక్కడా ? అవి ఏమయ్యాని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌ను నిలదీశారు. ప్రభుత్వం ఇచ్చిన పనులు చేయకుండానే అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి సొమ్ముచేసుకున్నారని ఆరోపించారు. తుఫాన్‌ల దెబ్బకు మండలంలో 6000 ఎకరాలు మినుము, అలసంద పంట చేతికి రాకుండా దెబ్బతిన్నాయి. వ్యవసాయ అధికారులు పంటల నష్టాన్ని పరిశీలించకుండానే నష్టం జరగలేదని జిల్లా అధికారులకు రిపోర్టు పంపించారని బ్రహ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి ధ్వజమెత్తారు. సీతారాంపురం సబ్ స్టేషన్ పరిధిలో ఏఈ, లైన్‌మెన్‌లు రైతులకు అందుబాటులో ఉండకుండా డబ్బులు ఇచ్చిన వారికే పనులు చేస్తున్నారన్నారు.

ప్రొటోకాల్ ఎక్కడా ?

రెవెన్యూ సదస్సులు నిర్వహించేటప్పుడు ఎంపీపీని ఎందుకు ఆహ్వానించలేదని, ప్రజా ప్రతినిధులకు ప్రొటోకాల్ ఎక్కడా ? అని ఎంపీపీ గాయం సావిత్రి తహసీల్దార్ దిలీప్ కుమార్‌ను ప్రశ్నించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఆహ్వానించకుండా సదస్సులు, గ్రామ సభలు, సమావేశాలు ఎలా నిర్వహిస్తారన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. రంగసుబ్బరాయుడు, ఎంఈవోలు పెద్దిరాజు, ఎస్ రమణయ్య, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలతో ప్రకృతి పరిరక్షణ



మహమ్మదాపురంలో చిత్తడి నేలల దినోత్సవంలో విద్యార్థులు

కొండపి: చిత్తడి నేలలు ప్రకృతి పరిరక్షణకు నెలవులు అని ఏపీఎస్జీసీ ఒంగోలు డివిజన్ క్లస్టర్ కో ఆర్డినేటర్ ఉమా నాగబ్రహ్మాచారి అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని జిల్లా ముప్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రం నది తీర ప్రాంతాల్లో లోతు తక్కువగా ఉండి ఎక్కువ కాలం నీటి నిల్వ ఉండే భూములను చెత్తడి నేలలంటారని అన్నారు. సముద్ర తీరంలోని భూములు అలల తాకిడికి దెబ్బ తినకుండా ఈ చిత్తడి నేలలు అడ్డుకట్ట వేస్తాయని అన్నారు. దక్షిణాసియాలోని చెత్తడి నేలలు ఎక్కువగా ఉన్న దేశాల్లో మనదేశం మొదటి స్థానంలో ఉందని అన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్‌ఎం శ్రీదేవి,ఉపాధ్యాయులు ప్రసాద్ రావు,శివ శంకర్ తదితర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల పరిధిలోని మహమ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని హెచ్‌ఎం శ్రీనివాస రావు ఆధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులకు చిత్తడి నేలల సంరక్షణ అంశంపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీ.విజయ్ బాస్కర్ రెడ్డి, ఎం.మోషే, దద్దాల శ్రీనివాసులు క్లస్టర్ కో ఆర్డినేటర్ కే శేశిభూషణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపం లేకుండా జాగ్రత్త వహించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో మల్లీశ్వరి

సింగరాయకొండ: అయోడిన్ లోపం కారణంగా పురుషులు, స్త్రీలలో థైరాయిడ్ సమస్యలు రాగా స్త్రీలలో ముఖ్యంగా పీసీఓడీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని టంగుటూరు సీడీపీవో మల్లీశ్వరి సూచించారు. మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల గీతామందిరంలో సోమవారం అయోడిన్ లోపం వలన కలిగే రుగ్మతలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇన్‌స్టిట్యూట్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్త గర్భిణులు, బాలింతలు, వయోజన బాలలకు అయోడిన్ వలన కలిగే ఉపయోగాలను తెలియజేసి ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రిమ్స్ మెడికల్ అధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్, సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, సిబ్బంది బాపట్ల దివ్య, రంగలక్ష్మి, అరుణజ్యోతి, రేవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఉపయోగాలు



ద్రావణం తయారీని వివరిస్తున్న యూనిట్ ఇంచార్జ్ రంజిత్ కుమార్

కొండపి: పూత రాలకుండా, కాయ గట్టిదనం పెరగడానికి కోడిగుడ్డు, నిమ్మరస ద్రావణం ఉపయోగపడుతుందని యూనిట్ ఇంచార్జ్ రంజిత్‌కుమార్ అన్నారు. సోమవారం పెరిదేపి యూనిట్‌లోని కట్టువారిపాలెం గ్రామంలో రైతు సాధికార సంస్థ, డీపీఎం సుభాషిని ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం వలన మొక్కలకు అధిక బలం, పోషకాహారం అందుతుందని తెలిపారు. తాలు లేకుండా మంచి విత్తనాలు ఏర్పడతాయని రైతులకు సూచించారు. ముందుగా ద్రావణం కలిపే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ గౌతమీ, మాలకొండయ్య ప్రకృతి వ్యవసాయ రైతు రాఘవులు, మద్దాల సుబ్బారావు, సింగయ్య, రైతులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేసిన చైర్మన్



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: సచివాలయంలోని అధార్ కేంద్ర సిబ్బంది, అధికారులు సకాలంలో స్పందించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని నాలుగో సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని సోమవారం చైర్మన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ కార్డు తప్పనిసరైనా.. నూతన ఆధార్, సవరణలు, చేర్పులు,మార్పులకు వచ్చి ప్రజలకు ఇబ్బంది పెట్టకుండా సరైన సమాధానంతో సకాలంలో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఖాజా రసూల్, పవన్ కుమార్, ఆయిషా, ఉమా, చిన్న నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న బోర్డు అధికారులు

కనిగిరిరూరల్: పొగాకు రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక లాభాలను పొందాలని రీజనల్ మేనేజర్ ఎం లక్ష్మణరావు, వేలం నిర్వాహణ అధికారి బీ కోటేశ్వరరావులు అన్నారు. సోమవారం మండలంలోని బడుగులేరు, గాయం వారిపల్లి, పట్టాభిరామపురం, గానుగ పెంట గ్రామాల్లో రైతు మిత్రబృందం పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు పొగాకు రైతులు ఆకు రేలుపు, క్యూరింగ్ సమయంలో, బీట్ గొట్టం అమర్చే సమయంలో తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి తెలిపారు. నిర్ణీత వ్యవధికి మండలను తిరగవేయడం ద్వారా నాణ్యత దెబ్బతినకుండా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఐటీసీ క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ జీ వెంకటరావు, పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ ద్విచక్ర వాహనదారులకు శ్రీరామరక్ష

కనిగిరిరూరల్: వాహనదారులు హెల్మెట్‌లు ధరించి ప్రాణరక్షణ పొందాలని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శిరస్సుకు హెల్మెట్ ధరించాలని వాహనదారులకు అవగాహన కల్పిస్తూ సోమవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పామూరు బస్టాండ్ సెంటర్‌లో సీఐ ఎస్‌కే ఖాజావలి అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ మాట్లాడుతూ హెల్మెట్ లేని వాహనదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈసందర్భంగా హెల్మెట్ ధరించి బైక్‌లు నడుపుతున్న ద్విచక్ర వాహనదారులు గులాబి పూలు అందించి అభినందించారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ ధరించిన వారికి గులాబీ ఇస్తున్న డీఎస్పీ